www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 17 మార్చి 2023
5
చిత్తూరు

ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎస్వి సెట్ (ఆర్విఎస్) కాలేజీలో ఉదయం 8గంటలకు ప్రారంభం ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు ఆర్విఎస్ లాకాలేజీలో ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్, పట్టభద్రుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎన్నికల పరిశీలకులు ఎస్‌హెచ్.భాస్కర్ కాటమనేని, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ సమక్షంలో ఓట్లలెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్నది. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హరినారాయణన్ భారత ఎన్నికల సంఘం, న్యూఢిల్లీ వారిచే నియామకం కాబడ్డ సెక్షన్ ఆఫీసర్లు రోహిత్ కుమార్, సౌరబ్ రానా, దీపక్ కుమార్ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూములను తెరిచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి సిబ్బంది తరలించారు. పట్టభద్రుల సహాయ రిటర్నింగ్ అధికారి, జెసి డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఉపాధ్యాయుల సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ పర్యవేక్షణ చేస్తున్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి కౌంటింగ్‌లో...

పీడీఎఫ్, వైసిపి పోటాపోటీ

- పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 1769 ఓట్ల లీడింగ్
- చెల్లని ఓట్ల విషయంలో వైసిపి,టిడిపి మధ్య వివాదం
- రిటర్నింగ్ అధికారి జోక్యంతో ప్రశాంతం
- 'ఫలితాలు' అర్ధరాత్రి తరువాతే...

కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి హరినారాయణన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం ఫలితాల్లో వైసిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్య పోటాపోటీ నెలకొంది. ప్రతి రౌండ్‌లోనూ నరాలు తెగేంత ఉత్కంఠ నెలకొంది. వైసిపి అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి స్వల్ప మెజార్టీతో బయట పడుతూ వచ్చారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటలకు చిత్తూరు - తిరుపతి రహదారిలోని ఆర్విఎస్ లా కళాశాలలో రిటర్నింగ్ అధికారి హరినారాయణన్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజశేఖర్ సమయంలో ప్రారంభమయ్యింది. మొత్తం 24,714 ఓట్లు పోలయ్యాయి. 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక రౌండ్‌కు ఏడువేల చొప్పున మూడు రౌండ్లను లెక్కించారు. 465 ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడున్నర రౌండ్లకు గాను వైసిపి అభ్యర్థికి 10,372 ఓట్లు రాగా, పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డికి 8,603 ఓట్లు వచ్చాయి. టిడిపి మద్దతు ఇచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి ఎల్‌సి రమణారెడ్డికి 2286 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డికి మ్యాజిక్ ఫిగర్ 12,500 ఓట్లు రావాల్సి ఉంది. దీంతో 'రెండో ప్రాధాన్యత' ఓటు అవసరమయ్యింది.

వైసిపి, పీడీఎఫ్ మధ్య వివాదం

వైసిపి అభ్యర్థికి 2,128 ఓట్లు కావాల్సి ఉంది. చెల్లని ఓట్లనూ పరిగణనలోకి తీసుకుని, తరువాత రెండో ప్రాధాన్యతకు వెళ్లాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజశేఖర్ సూచించారు. అయితే పీడీఎఫ్ అభ్యర్థులు మొదటే చెప్పకుండా, మధ్యలో చెప్పడం ఏంటని వాగ్వివాదానికి దిగారు. ఎన్నికల అధికారి హరినారాయణ జోక్యం చేసుకుని పారదర్శకంగా కౌంటింగ్ జరిపిస్తామని, విశాఖలోనూ, పశ్చిమ రాయలసీమలోనూ ఇలానే జరిగిందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఒకటికి రౌండ్ వేసి టిక్ కొట్టి ఉంటే ఆ ఓటు చెల్లుతుందని, ఒకటి వేసి టిక్ కొడితే చెల్లనిదిగా చూడాలని, ఓటర్లను గౌరవించాలని సూచించారు. ఇరు గ్రూపులు అంగీకరించాయి. చెల్లని ఓట్లను పరిగణనలోకి తీసుకుని లెక్కించారు. 637గా ఉన్న చెల్లని ఓట్లు ఉన్నాయి. పరిగణనలోకి తీసుకున్న లెక్కల తరువాత 465గా చెల్లలేదని తేల్చారు. 88 వైసిపి అభ్యర్థికి, 60 పిడిఎఫ్‌కు, 24కు ఎపిటిఎఫ్‌కు కలిపారు. వైసిపికి 10,372, పీడీఎఫ్‌కు 8,603, ఎపిటిఎఫ్‌కు 2,286 ఓట్లుగా కలిసొచ్చాయి. పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిపై వైసిపి అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి 1769 ఓట్ల మెజార్టీతో 'మొదటి' ప్రాధాన్యతలో లీడ్‌గా నిలిచారు. రెండో ప్రాధాన్యత లెక్కింపు కార్యక్రమం రాత్రి 9.30 గంటలకు ప్రారంభమయ్యింది. అర్ధరాత్రి పైనే ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు- చిత్తూరు ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు ఆర్ వి ఎస్ లా కాలేజీ లో ఎన్నికల పరి శీలకులు కోన శశిధర్ ఐఏఎస్. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ యం. హరినారాయణన్ సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో మొత్తం 917 మంది సిబ్బంది ఉన్నారు.

పట్టభద్రుల 'ఫలితం' మరింత జాప్యం

తొలిరౌండ్‌లో టీడీపి లీడ్

తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కౌంటింగ్‌లో టిడిపి ముందంజలో ఉంది. తొలి రౌండ్‌లో 40 టేబుళ్లు ఉండగా టిడిపి మెజార్టీ కనిపించింది. వైసిపి ఒకే ఒక్క టేబుల్లో మెజార్టీ ఉంది. వైసిపి అభ్యర్థి పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డిపై టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ 4,300 ఓట్ల మెజార్టీతో ఉన్నారు. పీడీఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఈ మూడింటి మధ్యే పోటీ చివరి వరకూ ఉండనుంది. తొలిరౌండ్‌లో వైసిపి చెల్లని ఓట్లు 3,800 ఓట్లు కావడం గమనార్హం. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల ఫలితం మరింత జాప్యం కానుంది.. దాదాపు శుక్రవారం సాయంత్రానికి ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అంచనా. పట్టభద్రుల పోలైన ఓట్లను దాదాపు గురువారం సాయంత్రం వరకూ 25 చొప్పున కట్టలు కట్టడానికే సిబ్బందికి సమయం సరిపోయింది. 2,68,387 ఓట్లు పోలయ్యాయి. రెండు స్థానాల రీపోలింగ్ ఓట్లు 636, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 786 ఉన్నాయి. ఆర్విఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో 40 టేబుళ్లను ఏర్పాటు చేసినప్పటికీ కౌంటింగ్ మొత్తం పూర్తయ్యేసరికి శుక్రవారం అర్ధరాత్రి దాటినా ఆశ్చర్యపోనక్కరలేదు. పట్ట భద్రుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎన్నికల పరిశీలకులు ఎస్. హెచ్. భాస్కర్ కాటమ నేని ఐ ఏ ఎస్. ఎన్నికల అధికారి హరినారాయణన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. చిత్తూరు జేసీ వెంకటేశ్వర్, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతుమాధవన్, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, జిల్లా రెవెన్యూ అధికారులు ఎన్.రాజశేఖర్, తిరుపతి శ్రీనివాసరావు, నెల్లూరు వెంకట నారాయణమ్మ, ప్రకాశం ఓబులేశు పాల్గొన్నారు. మదనపల్లి ఆర్డీవో మురళి, నెల్లూరు మలోలా, బాపట్ల రవీంద్ర, శ్రీకాళహస్తి రామారావు, గూడూరు కిరణ్‌కుమార్, చిత్తూరు రేణుక, పలమనేరు శివయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కౌంటింగ్‌లో రౌండ్లు వారీగా వచ్చిన ఓట్లు

మొదటి రౌండ్		
వైసిపి		3079
పీడీఎఫ్		2522
ఎపిటిఎఫ్		847
లీడ్		557 (వైసిపి)
రెండో రౌండ్		
వైసిపి		2964
పీడీఎఫ్		2560
ఎపిటిఎఫ్	933	
లీడ్		404 (వైసిపి)
మూడో రౌండ్		
వైసిపి		3,008
పీడీఎఫ్		2,481
ఎపిటిఎఫ్	66	
లీడ్		521 (వైసిపి
నాలుగో రౌండ్		
వైసిపి		1233
పీడీఎఫ్		980
ఎపిటిఎఫ్	416	
లీడ్		252 (వైసిపి)

ఒరిగిందేమీ లేదు..!



- జగనన్న 'సంక్షేమ' బడ్జెట్
- ఈ ఏడాది వ్యవసాయ మీటర్లు
- 'ఆర్‌బికె'లు కర్షక దేవాలయాలుగా వర్ణన
- వెటర్నరీ వర్సిటీకి రూ.138.50 కోట్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అసెంబ్లీలో గురువారం ఆర్థిక శాఖా మంత్రి ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో కొత్తదనం ఏమీ లేదు. తిరుపతి జిల్లాకు ప్రత్యేకంగా ఒరిగిందీ ఏమీ లేదు. అంతా జగనన్న 'సంక్షేమాల' బడ్జెట్‌గానే రూపకల్పన చేసినట్లుగా ఉంది. గురువారం రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను, వ్యవసాయ బడ్జెట్‌నూ ఇరువురు మంత్రులూ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వార్షిక బడ్జెట్ సంక్షేమాల బడ్జెట్‌గా ఉంటే, వ్యవసాయ బడ్జెట్ మాత్రం 'వ్యవసాయ మీటర్ల' బడ్జెట్‌గా ఉంది. ప్రత్యేకించి జిల్లాలకు ఒరిగిందేమీ లేదన్న విమర్శలను ప్రతిపక్షాలు నొక్కి చెబుతున్నాయి. ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు లేకపోవడం రాయలసీమ ప్రజానీకాన్ని నీరసింపజేసేలా ఉంది.

జగనన్న నవరత్నాల్లో భాగంగా పింఛన్లు, విద్యాదీవెన, వసతిదీవెన, రైతుభరోసా, రైతులకు వడ్డీలేని రుణాలు, ఆసరా, చేదోడు, వాహనమిత్ర, నేతన్న నేస్తం, లా నేస్తం, మత్స్యకార భరోసా, ఈబీసీ నేస్తం, కల్యాణమస్తు పథకాలకు ఎప్పటిలానే 'సంక్షేమం' పేరుతో రాష్ట్ర బడ్జెట్‌లో భాగంగానే జిల్లాలోని లబ్దిదారులకు పథకాలు అందనున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి రూ.532 కోట్లను రాష్ట్రవ్యాప్తంగా కేటాయించారు. హంద్రీనీవా-సుజల స్రవంతి ప్రాజెక్టు మొదటి దశ, రెండో దశలను 2023, డిసెంబర్ నాటికి పూర్తి చేయడానికి ప్రణాళిక చేయబడింది. గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు మొదటి దశను 2025, మార్చి నాటికి, రెండో దశను 2026, మార్చి నాటికి పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఈ ఏడాది వ్యవసాయానికి మీటర్లు

రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 96,300 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. రాష్ట్రంలో 19.21 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ద్వారా రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించిన నగదు బదిలీ కోసం వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం మీటర్లు బిగించనుంది. ఇందుకయ్యే ఖర్చు మొత్తం 5,692 కోట్లను ప్రభుత్వమే భరించనున్నట్లు ప్రకటించింది. అలాగే చిరు ధాన్యాలకు క్వింటా రూ.2500 చొప్పున కనీస మద్దతు ధర ప్రకటించింది. కర్షక దేవాలయాలుగా రైతు భరోసా కేంద్రాలను ప్రకటిస్తూ విత్తనం నుంచి విక్రయం వరకూ రైతులకు సేవలందించనున్నట్లు ప్రకటించింది. ఆర్‌బికెలు, గోదాముల శాశ్వత భవన నిర్మాణానికి నిధులను కేటాయించింది. అయితే గత ఏడాది రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిన సేవలు నామమాత్రమే. రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు ప్రకటించింది. పెట్లూరు చీని, నిమ్మ పరిశోధన కేంద్రం, తిరుపతి చీని, నిమ్మ పరిశోధన కేంద్రాలకు 2 స్టార్ రేటింగ్ గుర్తింపు లభించింది. సిట్రస్ రీసెర్చి స్టేషన్ తిరుపతి వాణిజ్య నర్సరీకి 3 స్టార్ రేటింగ్ లభించింది. వైఎస్ఆర్ చేయూత పథకం కింద పశువులు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. 2023-24లో రెండు లక్షల పాడి పశువులను అందజేయుటకు ప్రణాళికలను తయారు చేశారు. పశువైద్యశాలలకు మందుల సరఫరా నిమిత్తం ప్రతి రైతు భరోసా కేంద్రానికి నెలకు 2వేల చొప్పున రూ.65 కోట్లు ఈ ఏడాది ప్రతిపాదించారు. డాక్టర్ వైఎస్ఆర్ పశు నష్టపరిహారం కింద రూ.150 కోట్లను ప్రతిపాదించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో దేశవాళీ పశువుల (ఒంగోలు, పుంగనూరు, సాహివాల్) వీర్యాన్ని పరిరక్షించే అంశంపై పరిశోధనలు జరుగుతున్నాయి. 2022-23లో దాదాపు 5.63 లక్షల ఒంగోలు జాతి, పుంగనూరు జాతి వీర్యకణాలు, నాలుగు సుపీరియల్ బ్రీడింగ్‌ర్యామ్స్, 65వేలు పశుగ్రాస పిలకలను, 700 వనరాజా కోళ్లను రైతులకు అందజేశారు. మూడు పశువైద్య అత్యవసర వైద్య వాహనాలు, రెండు పశు విజ్ఞాన ప్రచార వాహనాలతో రైతులకు సేవలు అందిస్తున్నారు. వెటర్నరీ వర్సిటీకి ఈ ఏడాది రూ.138.50 కోట్లు కేటాయించారు.

కార్మికుల ఊసే లేని బడ్జెట్

సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య

చిత్తూరుఅర్బన్: గురువారం రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన బడ్జెట్ ప్రసంగంలో కార్మికుల గురించి ఒక్కమాట కూడా చెప్పలేదని కార్మికశాఖకు గత సంవత్సరం చేసిన కేటాయింపుల్లో ప్రభుత్వం రూ.400కోట్లు కోత పెట్టారని సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య గురువారం ఒక ప్రకటనలో రాష్ట్ర బడ్జెట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో గతసంవత్సర కేటాయింపులనే కొనసాగించిందని, కార్మికశాఖలో ఉన్న లేబర్ అధికారుల ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం అత్యంత దుర్మార్గంగా ఉందన్నారు. పారిశ్రామికశాఖ కూడా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైందని, గత సంవత్సరపు కేటాయింపుల్లో భారీగా రూ.2వేల కోట్లు ఖర్చు చేయలేదని, మరలా ఈ సంవత్సరం కూడా గత కేటాయింపుల కంటే తగ్గించిందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పట్ల వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. లేబర్ వెల్ఫేర్, బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేసిందని, వాటి వద్ద ఉన్న నిధులను దారి మళ్ళించిందన్నారు. ఈబడ్జెట్‌లో కూడా ఆ నిధులను తగ్గించి చెల్లించలేదన్నారు. ఈబడ్జెట్ ప్రతిపాదనలు పూర్తిగా కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు
విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ధర్నాకు దిగిన బంధువులు

కృష్ణప్ప మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- వికోట

మండల పరిధిలోని నడమంత్రం గ్రామ సమీపంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మరణించాగా, మరో వ్యక్తి తీవ్రంగాం గాయపడిన సంఘటన గురువారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికోట మండలం ముదరందొడ్డి పంచాయతీ, నడమంత్రం చెరువులో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగడంతో కరెంట్‌షాక్ తగిలి అదే గ్రామానికి చెందిన కృష్ణప్ప (52) అక్కడిక్కడే మృతిచెందగా, మరో వ్యక్తి బాలాజీ (45) తీవ్రంగా గాయపడ్డారు. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన బాలాజీ నీటిలో ఇరుక్కుపోవడంతో అతన్ని కాపాడేందుకు వెళ్లిన కృష్ణప్ప అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో ఇద్దరూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీన్ని గమనించిన స్థానికులు క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం హుటాహుటిన వికోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా కృష్ణప్ప అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలాజీ పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని అంబులెన్స్‌లో వీకోట ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

పలుమార్లు విద్యుత్ లూజ్ లైన్లపై ఫిర్యాదు చేసినా రెస్కో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గురువారం ఈ సంఘటన జరిగిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ వీకోట పట్టణంలో జాతీయ రహదారిపై బైఠాయించారు. తమకు న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ కుప్పం - పలమనేరు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు బాధితులకు నచ్చజెప్పి కేసు నమోదు చేసి న్యాయం చేస్తామని తెలిపారు. అయితే బాధితులు మాత్రం ఎన్నోసార్లు సమస్యపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, విద్యుత్ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఓ నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రెస్కో అధికారులు మృతుని కుటుంబానికి అన్నివిధాల సహకారం అందిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంభూపాల్ తెలిపారు.

గురుకులంలో ఐదో తరగతికి దరఖాస్తులు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చేరడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దమయంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి కులాలకు చెందిన విద్యార్థినులు ఈ యేడాది 4వ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. వారు ఈనెల 24వతేది లోపు ఏపీజీపీ సెట్, ఏపీ సీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు

- 1161 మంది విద్యార్థులు గైర్హాజరు
- సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు
- ఇద్దరు విద్యార్థులు డీబార్

ప్రజాశక్తి- తిరుపతి సిటి: ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గురువారం ఇంటర్ రెండోవ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. మొత్తం రెండు జిల్లాలోని 141 సెంటర్లల్లో జనరల్ కేటగిరిలో 42300 మంది విద్యార్థులకు గానూ 1161మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 41139 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, అదేవిధంగా తిరుపతిలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు తిరుపతి ఆర్ఐఓ వి.రమేష్ విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా రెండోవ రోజు కూడా పరీక్షలు రాస్తున్న విద్యార్థుల హాల్‌టికెట్‌లో సరైన సెంటర్ అడ్రస్ లేనందువలన చాలామంది విద్యార్థులు అడ్రస్ తెలియక ఆందోళన చెందారు. ఈవిషయంలో ఇంటర్మీడియట్ బోర్డు ఘోరంగా విఫలమైందని చెప్పొచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం మేరకు సీసీ కెమెరాలు, పోలీస్, రెవెన్యూ, ఇంటర్ విద్యాశాఖ అధికారులు, ఇతర అధికారుల సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా ప్రశాంత వాతావరణంలో ఇంటర్ రెండోవ సంవత్సరం పరీక్ష జరిగాయి. నేడు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పేపర్ వన్ జరుగుతుందని తెలిపారు.

నగరి : ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమైంది. తొలిరోజు తెలుగు, తమిళం, సంస్కృతం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8.45 గంటలకు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్షాకేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు స్క్వాడ్ బందం కేంద్రాలలో పర్యటించింది. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తొలిరోజు పరీక్షకు మండలంలో 909మంది విద్యార్థులకు గాను 897మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

గుడిపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షకేంద్రాన్ని గుడిపల్లి మండలం ఎంపీడీవో శంకర్ తనిఖీ చేశారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని అక్కడ ఉన్న సిబ్బందికి సూచించారు.

నగరిలో..

ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పి వై.రిశాంత్‌రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి అయిన మహాపురుషుడు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కషిచేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్ఐబి డిఎస్‌ఈఓ అడిషనల్ ఎస్పీ లక్ష్మీ, ఆర్ఐ ఎంటిఓ మధు, డిపిఓ ఏఓ ఎంవి. మోహన్‌రావు, ఏఏఓ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: ఆంధ్రరాష్ట్ర అవతరణకు మూలపురుషుడు పొట్టి శ్రీరాములు అని కట్టమంచి బాలకష్ణారెడ్డి తెలిపారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ రామలక్ష్మి, సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులోని గంగమనేని చెరువు వద్ద..

సోమలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన ఉపాధ్యాయులు

సోమల : సోమల మండలం నంజంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. అమర జీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. హెచ్ఎం కుసుమాంబ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఆశలు ఆవిరి

రాలిన మామిడి పిందెలు

ప్రజాశక్తి- పలమనేరు : పలమనేరు రూరల్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కురిసన అకాల వడగళ్ల వర్షానికి మామిడి తోటల్లోని మామిడి పిందెలు నేలరాలాయి. పిందె దశలో ఉన్న మామిడి నూటికి 40 శాతం నేలరాలాయని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా అకాల వర్షం మే, జూన్ నెలల్లో కురుస్తుంది. ఈ సీజన్‌లో కాసే మామిడి, వరి, రాగి తదితర పంటలు రైతులు పూర్తిగా నష్టపోతుంటారు. మార్చి నెలలో కూడా ఇటువంటి వడగండ్ల వర్షాల వలన మామిడి పంటలతోపాటు ఇతర పంటలు కూడా దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో కూడా అనేకసార్లు అకాల వర్షాలతో పూర్తిగా నష్టపోయిన రైతులు మామిడితోపాటు అనేక రకాల పండ్లతోటల సాగు చేశారు. లక్షల రూపాయలు అప్పులు శ్రమించి పండించిన పంటల్లో వచ్చిన లాభం ఏమీ లేదని, మామిడి తోటలను లీజుకు తీసుకుని నష్టాలపాలవుతున్నామని మామిడి రైతులు చెబుతున్నారు.

సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు

ఎంపీడీవో శ్రీనివాస విశ్వనాథ్

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి- పెద్దపంజాణి: గ్రామసచివాలయం సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, సమయపాలన పాటించకపోతే కఠినచర్యలు తప్పవని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గురువారం సమయపాలన పాటించకుండా విధులకు హాజరైన సచివాలయం సిబ్బందిని మండల అభివృద్ధి కార్యాలయానికి పిలిపించుకొని హెచ్చరించారు. మరోసారి విధులకు లేటు కావద్దని ఈ విధంగా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగి హాజరు నమోదు విషయంలో క్రమశిక్షణ పాటించాలన్నారు. గతంలో కాకుండా ఇప్పుడంతా ఆన్‌లైన్ విధానం రావడం వలన క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉద్యోగుల పనితీరును గమనిస్తుంటారని గుర్తించుకోవాలని అన్నారు. అత్యవసర సందర్భాలలో తప్పనిసరిగా మినహాయింపు ఇవ్వడం జరుగుతుందని కాని ముందస్తు సమాచారం ఇవ్వాలని అన్నారు. సచివాలయం సిబ్బంది హాజరును టెలికాన్ఫరెన్సులో, వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి సమీక్షిస్తున్నారని, సిబ్బంది హాజరు విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు.

విజయవంతంగా ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం ద్రవిడియన్ అండ్ కాంపుటేషనల్ లింగ్విస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'భారతీయ భాషలలో తార్కిక ఒప్పంద వ్యవస్థ' అనే అంశంపై మూడు రోజుల కార్యశాల (వర్క్‌షాపు)ను భారతీయ భాషా సమితి, విద్యామంత్రిత్వశాఖ, భారతప్రభుత్వం వారి సౌజన్యంతో గురువారం ల్వింగిస్టిక్స్ విభాగం సెమినారు హాలులో ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈముగింపు సమావేశంలో ఆచార్య కష్ణరాజు, భరత నాట్యాచార్యులు, అన్నామల్కై విశ్వవిద్యాలయం వారు మాట్లాడుతూ భరతనాట్యం ఒక నత్యకళ మాత్రమే కాదు మనిషి ఆలోచనలను భావరూపంలో ప్రకటించడం, ఆ భావాలను వ్యక్తపరచడం అని తెలిపారు.

వర్క్‌షాప్‌లో పాల్గొన్న పరిశోధక విద్యార్థులు

మనిషి మొదట తన బాల్యంలో మాటలు రాక మునుపు తల్లితో సంభాషించేది కేవలం సైగల ద్వారానే మొదలవుతుందని అదే తరువాత అస్పటమైన పిలుపులతో తదుపరి స్పష్టమైన మాటల ద్వారా భావవ్యక్తీకరణ జరుగుతుందన్నారు. అలాగే సంగీత సాధకుడు హదయం నుండి స్పందించి కాళ్ళ ద్వారా ప్రతిస్పందించబడి చేతులు, కళ్ళ ద్వారా తన అభినయంతో ప్రేక్షకులకు భావవ్యక్తీకరణ ప్రదర్శిస్తాడని అన్నారు. అనంతరం విద్యార్థిని డాక్టర్ మధుమౌళి నవరస అభినయం అందర్నీ ఆకట్టుకుంది. అదేవిధంగా మద్రాసు విశ్వవిద్యాలయం నుండి వచ్చిన ఆచార్య సౌందరాజన్, ఆచార్య కరుణాకరన్ మాట్లాడుతూ ప్రాచీన దేవాలయాలలో ముద్రించిన శాసనాలలో ప్రాచ్యరాజకీయ పద్ధతులు వారు పాటించిన ఖచ్చితమైన ప్రమాణాలు భాషలు పట్ల వారికున్న మక్కువ ప్రస్తుత రాజకీయ వ్యవస్థ, రావాల్సిన మార్పులను గురించి విద్యార్థులకు వివరించారు. విద్యాత్మక పీఠాధిపతి ఆచార్య లోకనాథ వల్లూరు మాట్లాడుతూ ఇటువంటి కార్యశాలలకు విద్యార్థులు హాజరుకావడం వలన ఎంతో మేథోసంపత్తిని సముపార్జివచవచ్చని తెలిపారు. స్కూల్ ఆఫ్ హ్యూమన్ అండ్ సోషల్ సైన్స్ పీఠాధిపతి ఆచార్య ఎం.ఎన్.వెంకటేశ భారతీయ భాషలలో తార్కిక ఒప్పంద వ్యవస్థ, ఆవశ్యకత, ప్రజలు రోజువారి పనులలో భావవ్యక్తీకరణ వివరించారు. శాఖాధ్యక్షులు ఆచార్య గణేషన్ అంబేద్కర్, కార్యశాల కోఆర్డినేటర్, ఇన్‌చార్జ్ పీఠాధిపతి ఆచార్య కేశవమూర్తి, కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్ నాయక్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సీజ్ చేసిన వాహనంతో పాటు ముద్దాయిని చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి- పులిచెర్ల: మండలంలోని చల్లావారిపల్లి నుంచి కల్లూరు వైపు గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి డ్రైవర్‌ను కల్లూరు పోలీసులకు అప్పగించినట్లు పులిచెర్ల స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ శ్రీనివాసమూర్తి, ఎస్సై కవీశ్వర్ నాయుడు తెలిపారు. ఎస్ఈబి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చల్లావారిపల్లి వద్ద ఎస్ఈబీ పోలీసుల వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈనేపథ్యంలో కల్లూరు వైపు ఇసుకతో వెళుతున్న ట్రాక్టర్‌ను అపి రికార్డులు పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగు టన్నుల ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ హరిక్రిష్ణను కల్లూరు పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్ఈబి పోలీసులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం

పురస్కారం అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పలమనేరు: రోజుకో రూపాయి పొదుపు ద్వారా వచ్చిన డబ్బుతో సేవా కార్యక్రమాలతో పాటు చదువులో ఉన్నతంగా రాణిస్తున్న విద్యార్థులను పలువురు పట్టణ ప్రముఖులు గురువారం సన్మానించారు. వైద్యవిద్యలో ఉత్తీర్ణత సాధించి ఎంబిబిఎస్ ఎస్వీ మెడికల్ కాలేజీ తిరుపతిలో మూడో సంవత్సరం చదువుతున్న లహరి (దివ్య), బిటెక్ మొదటి సంవత్సరంలో 95 శాతం మార్కులు సాధించిన కందూరి నిహారిక, బిటెక్ డేటా సైన్సు మూడో సంవత్సరంలో 92 శాతం సాధించిన సాయి పూజిత, డిప్లమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్‌లో 95శాతం సాధించిన సాయికీర్తనలతో పాటు క్రీడల్లో ఉన్నతంగా రాణించిన లిఖిత్‌సాయిను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎస్‌విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ మార్చి 27,28 తేదీలతో ఎన్ఎఎసి మూల్యాంకనానికి కళాశాల వెళుతున్న నేపథ్యంలో కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేషులు, వైస్‌ప్రిన్సిపాల్ విజయశేఖరం, సీనియర్ అధ్యాపకులు చిదంబరం, అధ్యాపకులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ విలువైన సలహాలను అందించి తద్వారా కళాశాల ఉత్తమ గ్రేడింగ్ సాధించడానికి తోడ్పడాలని కోరారు. ప్రతి పూర్వవిద్యార్థి మార్చి 19 ఆదివారం ఉదయం11 గంటలకు కళాశాలలో జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పేదరిక నిర్మూలనకు పునాది: మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఐదోసారి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పునాది లాంటి బడ్జెట్ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు ఆర్థికంగా ప్రోత్సాహాన్ని అందించేలా బడ్జెట్‌లో డిబిటి పథకాలకు 54,228 కోట్ల కేటాయింపులు చేయడం హర్షణీయమన్నారు. ఈ రాష్ట్రంలోని పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఈబడ్జెట్ కొండంత భరోసాను కలిగించిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయరంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ఈ రాష్ట్రంలోని ప్రజలందరి ఆకాంక్షలను గౌరవించారన్నారు. ముఖ్యంగా ఒక మహిళా మంత్రిగా ఈబడ్జెట్‌లో మహిళలకు ఇచ్చిన ప్రాధ్యాన్యతకు ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలుపుతున్నాని అన్నారు.

నూతన ఎంఈవోగా శంకరయ్య

నూతన ఎంఈవో శంకరయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలానికి నూతన విద్యాశాఖ అధికారిగా తవణంపల్లి మండల ఎంఈఓ కె.శంకరయ్య గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పిల్లల గుణాత్మక విద్యనందించడంలో తన వంతు కషి చేస్తానని తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయులు తమకు సహకరించి సమయపాలన పాటించి, జగనన్న గోరుముద్ద అమలులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓను యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు జి.దేశయ్య, ఎం.శ్రీనివాసులు, రామ్మూర్తి, డి.పీతాంబరెడ్డి, డి.సుభాష్, పరమాత్మయ్య, పురుషోత్తం, బి.శంకర్, బండి ప్రభాకర్‌రెడ్డి, సిఆర్‌పిలు ఘనంగా సన్మానించారు.

బాల్యం నుంచే దంతాలు సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బాల్యం నుండే దంతాలు సంరక్షించుకోవాలని దంత వైద్యులు శ్వేత తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని భవిత భవనంలో మండల విద్యాధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమానికి వైద్యులు శ్వేత, పుష్ప, భార్గవి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు దంతాల పట్ల అవగాహన చేసుకోవాలని, భోజనం తినకముందు తిన్న తర్వాత దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. దంతాల్లో ఏమైనా సమస్యలుంటే డెంటర్ డాక్టర్‌ను సందర్శించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్ పి.హిమబిందు, మీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి- నగరి: సహకార బ్యాంకులు, సహకార సంఘాలు అందించే వివిధ పథకాలపై కళాబందం వారిచే రైతులకు అవగాహన కల్పించారు. గురువారం సహకారసంఘ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళా బందం ద్వారా రైతులకు అర్థమయ్యే విధంగా పథకాలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా నగరి బ్రాంచ్ మేనేజరు సందీప్ మాట్లాడుతూ 'సహకార బంధు' పథకం ద్వారా డిపాజిట్లపై వాణిజ్య బ్యాంకుల కన్నా అధిక వడ్డీరేట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈఅవకాశం ఈనెల 20వ తేదీ వరకు మాత్రమే ఉంటుందన్నారు. డిపాజిట్‌దారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎఫ్ఎల్‌సీ కోఆర్డినేటరు హేమప్రకాష్ మాట్లాడుతూ బ్యాంకువారు అందించే వివిధ రకాల రుణ సదుపాయాలను రైతులకు వివరించారు. బ్యాంకు సూపర్వైజర్ ఓ.ఆనందన్ మాట్లాడుతూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలకు మార్చి 31వ తేదీ వరకు మాత్రమే వడ్డీకి అపరాధపు వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో నగరి పీఏసీఎస్ డైరెక్టరు దామోదరం నాయుడు, సీఈవో కె.తులసి పిళ్ళె, బ్యాంకు సూపర్వైజర్ కార్తీక్, సంఘం సిబ్బంది గుణశేఖర్, శేఖర్, లేపాక్షి, తనికాచలం, అప్రైజర్ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న కళా బృందం

ఆశాలు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి - పాలసముద్రం: మండల పరిధిలోని ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి తమ పని బాధ్యతను సక్రమంగా చేయాలని వైద్యాధికారి వి.వసంతి తెలిపారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ వి.వాసంతి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి వడదెబ్బపై అవగాహన కల్పించాలని సూచించారు, గర్భిణీలు ప్రసవం వరకు వారి అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని హెచ్చరించారుజ గర్భిణీలో ప్రసవం సమయంలో 108 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో ఓఆర్ఎస్ పాకెట్లు ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత సంబంధిత కాసా కార్యకర్తపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తల పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి

గంగాధరనెల్లూరు: గ్రామాల్లో ప్రతిఇంటికీ వెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌పై ప్రత్యేకదష్టి సారించాలని డిఐఓ డాక్టర్ రవిరాజు పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా డే సందర్భంగా ఆశావర్కర్స్ విధులు, బాధ్యతలు గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ టీకాల ఇమ్యూనైజేషన్ వందశాతం పూర్తి చేయాలన్నారు. డిపిఎంవో శ్రీనివాసరావు, డాక్టర్ దుర్గాదేవి, సిహెచ్ శ్రీనివాసులు, సూపర్వైజర్లు ధర్మేంద్ర, శైల, ఎంఎల్‌హెచ్‌వోలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాల్యం నుంచే పౌష్టికాహారం అందించాలి

బంగారుపాళ్యం: పిల్లలకు బాల్యం నుంచే పౌష్టిహాకారం అందించాలని డిపిహెచ్ఎన్ఓ రేణుక ప్రభ తెలిపారు. గురువారం మండలంలోని మండల కార్యాలయంలో నెలవారీ ఆశా డే కార్యక్రమం మండల వైద్యాధికారి లోహిత్ చెంగల్రాయన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిహెచ్ఎన్ఓ రేణుక ప్రభ మాట్లాడుతూ బాలికలు కౌమార దశనుంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, గుడ్లు, తాజా కూరగాయలు ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఆశాలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ షమామ్ బేగమ్, ఆరోగ్య సూపర్ వైజర్స్ భగవద్గీత, సుమత, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల పరిధిలోని ఆశా వర్కర్లకు మండల వైద్యాధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ విజయచంద్ర డాక్టర్ శాలిని మాట్లాడుతూ వేసవిని దష్టిలో పెట్టుకొని గ్రామాల్లోని ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. అలాగే గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి వివరించాలని, హైరిస్కు వారు ప్రభుత్వ ఆసుప్రతిలో కాన్పు చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్వైజర్లు, ఎఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో ఆశాలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయచంద్ర

సంక్షిప్త వార్తలు

జీవో నెంబర్ 27 పై
క్వాలిఫైడ్ టీచర్లు హర్షం

ప్రజాశక్తి- పలమనేరు: గత 24 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 1998 క్వాలిఫైడ్ టీచర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ జీవో నెంబర్ 27ను విడుదల చేయడం పట్ల క్వాలిఫైడ్ టీచర్లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ సేవా కేంద్రం కార్యాలయం వద్ద సమావేశమై జీవో 27ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి మోహియుద్దీన్, జిల్లా బీసీ ఫెడరేషన్ కార్యదర్శి టికె.షణ్ముఖంలు ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఎఆర్.కుమార్, పట్టాభిరామ్, రోషన్ ఆలీ ఖాన్, షాధాద్, సూర్య ప్రకాష్, ప్రతాప్, వెంకటముని, నాగరాజు, సుశీల, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అవార్డుకు
గంగమాంబాపురం పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఆన్‌లైన్ ద్వారా నిర్వహించి ప్రదర్శనలో మండలంలోని గంగమాంబాపురం ఉన్నత పాఠశాల జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు తెలిపారు. గురువారం అధునాతన సైనిక విధానంపై ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి జ్ఞానసాయి, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు గుణశేఖర్‌ను హెచ్‌ఎం అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 2021-22 సంవత్సరానికి జిల్లాస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఎగ్జిబిషన్ ఇన్స్పైర్ అవార్డుకు తమ పాఠశాల విద్యార్థి ఎంపికై రాష్ట్రస్థాయిలో జరిగే ఎగ్జిబిషన్‌కు చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతివిద్యార్థి జ్ఞానసాయిని ఆదర్శంగా తీసుకుని ఎగ్జిబిషన్లలో ప్రతిభ చూపాలని సూచించారు. ఉపాధ్యాయులు వెంకటరత్నం, దేవదాసు, ప్రకాష్, శ్రీరాములు, విశ్వనాథ్. ఆనంద్, బాబు, గుణశేఖర్ పలువురు పాల్గొన్నారు.

ఎస్వీబీసీకి రూ.11 లక్షల విరాళం

ప్రజాశక్తి- తిరుపతి సిటి

మహారాష్ట్రకు చెందిన సునీల్ లఖన్ కుమార్ అగర్వాల్ గురువారం ఎస్వీబీసీ ట్రస్ట్‌కు రూ 11 లక్షలు విరాళం అందించారు. ఎస్వీబీసీ కార్యాలయంలో చైర్మన్ శ్రీ సాయికష్ణ యాచెంద్ర, సిఈవో షణ్ముఖ్ కుమార్‌కు దాత ప్రతినిధులు రాఘవేంద్ర, బాలసుదర్శన్ రెడ్డి ఈ మేరకు డిడిని అందజేశారు.

త్వరలో చెన్నై శ్రీవారి ఆలయం పునర్నిర్మాణం : టీటీడీ

ప్రజాశక్తి - తిరుమల: చెన్నయ్ టి.నగర్ లోని శ్రీవారి ఆలయం త్వరలో పునర్నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి వెల్లడించారు. చెన్నై నగరంలోని జిఎన్ చెట్టి వీధిలో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో గురువారం జరిగిన విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో ఛైర్మన్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉదయం 9 నుండి 9.45 గంటల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగిందని చెప్పారు. ప్రఖ్యాత సినీనటి కాంచనతోపాటు వారి కుటుంబ సభ్యులు రూ.40 కోట్లకు పైగా విలువైన ఈ స్థలాన్ని టీటీడీ కి విరాళంగా అందించారని తెలిపారు. దాతలతోపాటు చెన్నై భక్తుల విజ్ఞప్తి మేరకు ఈ స్థలంలో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం నిర్మించినట్టు చెప్పారు. టీటీడీ రూ.10 కోట్లతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టిందని, దీంతోపాటు చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్ రెడ్డి, సభ్యులు స్మిత ఇతర సభ్యుల ఆధ్వర్యంలో రూ.5 కోట్లతో గాలిగోపురం, కలశాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆలయంలో శుక్రవారం ఉదయం విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానంద సరస్వతి స్వామివారి సమక్షంలో ప్రాణప్రతిష్ట, మహాకుంభాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం తరహాలోనే ఇక్కడ నిత్య కైంకర్యాలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. గురువారం ఉదయం చతుష్టానార్చన, మూర్తిహెూమం, ప్రాయశ్చిత్తం, పూర్ణాహుతి, ధ్వజస్తంభ ఛాయ జలాధివాసం, బింబ నయనోన్మీలనం నిర్వహించారు. సాయంత్రం శయనాధివాసం చేపట్టారు. టిటిడి పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్ రెడ్డి, డెప్యూటీ ఈవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వర్ష సూచన : జేసీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మార్చి 16వ తేది నుంచి 20వ తేది వరకు జిల్లాకు వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ముఖ్యంగా వరి పండించే రైతులు అవసరమైన జాగ్రత్తలు తీసుకొని పంటను కాపాడుకోవాలని రైతాంగానికి జిల్లా జాయింట్ కలెక్టర్ డి. కె బాలాజి తెలిపారు. వరి పంట కోతకు సిద్ధంగా ఉన్నట్లయితే అటువంటి రైతులు పంట కోతను ఈనెల 20వ తేదీ వరకు వాయిదా వేసుకోవాలని సూచించారు. పంట కోత పూర్తి అయి ఉంటే నూర్పిడి చేయని రైతులు కోసిన పంటను కుప్పగా వేసి తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచాలని, కుప్ప చుట్టూ కాలువలా ఏర్పాటు చేసి మట్టిని కుప్ప వైపు గట్టుగా వేసి వర్షపు నీరు లోపలకి పోకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. పంట పొలంలో అధికంగా వర్షపు నీరు నిల్వ వుండకుండా పొలం గట్లను తెంచి ఉంచాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న, వాలిపోయి వున్న వరి పైరు, వర్షాల వల్ల వరి విత్తనాలు మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణం (50 గ్రా ఉప్పు ఒక లీటర్ నీటికి) పిచికారి చేసుకోవాలని తెలిపారు. వర్షం ఆగిపోయిన తర్వాత గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుందని, కావున చిరుపొట్టు దశ నుంచి గింజ గట్టి పడే దశ వరకు వున్న వరి పైరుకు తెగుళ్ళు సోకే అవకాశం ఉన్నందు వలన 2 గ్రాముల బావిస్టిన్ కి ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలని తెలిపారు.

క్రికెట్ స్టేడియం త్వరగా పూర్తి చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గొల్లవాణిగుంట వద్ద ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని గొల్లవాణిగుంట వద్ద నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, బండ్ నిర్మాణ పనులను గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట డి.ఈ. గోమతి, ఏ ఈ కామ్ ప్రతినిధులు బాలాజీ, అనిల్, కాంట్రాక్టర్లు ఉన్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేల సస్పెన్షన్
ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో 12 మంది తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం శాసనసభ వ్యవస్థకి, ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ అనిద దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలుగుదేశం నాయకులు దొరబాబు, పులివర్తి నాని, సురేంద్ర కుమార్, కోదండ యాదవ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలను, వైసిపి ప్రభుత్వ పరిపాలనలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నిస్తుంటే వైసీపీ ప్రభుత్వ మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజలను తప్పుదోవపట్టిస్తూ నమ్మించడానికి ఇటు అసత్య ప్రచారాలను చేస్తున్నారని అన్నారు. బహిరంగంగా ప్రభుత్వాన్ని విమర్శిస్తే తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసి నోరు నొక్కుతున్నారని, శాసనసభలో చెబుదామంటే స్పీకర్ ఏకపక్షంగా సస్పెండ్ చేసి బయటకు పంపుతున్నారు

IN THE COURT OF THE 2nd addl. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O. S. No. 871 of 2022
Between :
S.Dowlat Bee and another ...Plaintiffs.
And :
Masthan and others ...Defendants.
Summons to D. 6 to D. 8, D. 11 and D.12. in O.S. No. 871 of 2022.
Notice to R. 6 to R. 8, R. 11 and R.12. in I.A. No. 787 of 2022.
D.6. Hyder alli s/o Babji @ Babjan, Muslim, aged about 31 years,
D.7. S. Shabiya w/o Musthafa, Muslim, aged about 25 years,
D.8. Shabeera D/o Babji @ Babjan, Muslim, aged about 21 years,
R. 6 to R.8 are residing at Noori Nagar, Dalavaipalli village,Yadamari Mandalam, Chittoor dist.
D.11.Suryabhanu, W/o Abbas Mohamad, Muslim, aged about 29 years,
D.12. Saheena w/o C.K. Meharuka, muslim, aged about 22 years,
Residing at Rasool Nagar, Dalaivaipalli village, Yadamari mandal, Chittoor dist.
Please take summons that the above suit filed by the plaintiffs/ petitioners against all of you for grant of permanent injunction as well as I.A. no. 787 /2022 for grant of temporary injunction both are posted to 13-04-2023 for your summons in the suit and notice in the above I.A., Please present on that date at about 10-30 a.m. in the above court either in person or through your Advocate and file your objections if any or otherwise the matter will be decided as exparte.
J.K.SUDHARSAN,
Advocate,Chittoor,A.P,Cell:7993 272 024